## భక్తులతో యాదాద్రి కిటకిట





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


## ముగింపు దశకు చేరిన సరస్వతి పుష్కరాలు





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 148 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 26 మే 2025




భక్తులతో యాదాద్రి కిటకిట




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ముగింపు దశకు చేరిన సరస్వతి పుష్కరాలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 148 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 26 మే 2025

# అజేయ సైనిక శక్తి, అపార మోడీ యుక్తి

- ఎన్‌డిఎ కీలక సమావేశంలో తీర్మానం
- ఆపరేషన్ సిందూర కీలకమని ప్రశంస
- ప్రధాని సముచిత నిర్ధేశక విజయమని వెల్లడి

**న్యూఢిల్లీ,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ సాయుధ త్రివిధ సైనిక బలగాల శక్తి సామర్థ్యాలను , ప్రధాని మోడీ నాయకత్వ పటిమను బిజెపి సారధ్య ఎన్‌డిఎ కొనియాడింది. ఈ మేరకు ఆదివారం ఇక్కడ జరిగిన ఎన్‌డిఎ విస్తృత సమా వేశంలో తీర్మానం వెలువరించారు. ఈ సమావేశంలో ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు , ఉప ముఖ్యమంత్రులు ఇతర నేతలు పాల్గొన్నారు. పహల్గాం దాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర దశలో భారతీయ సైన్యం కనబర్చిన ధైర్యసాహసాలను ఈ సందర్భంగా భేటీలో ప్రస్తుతించారు. సకాలంలో సరైన మార్గ నిర్ధేశనంతో , అంతకు మించిన జాతీయ సమన్వయంతో ప్రధాని మోడీ తమ నాయకత్వ లక్షణాలను కనబర్చారని పేర్కొంటూ తీర్మానం ఆమోదించారు.రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ప్రతిపాదిత తీర్మానాన్ని శివసేన నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ బలపర్చారు. భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని , మనో నిబ్బరాన్ని ఆపరేషన్ సిందూర మరో మారు




వివరాలు 2లో

## సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**భూపాలపల్లి,25 (పిసిడబ్ల్యూ న్యూస్):** గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్నారు. హెలికాప్టర్‌లో కుటుంబ సమేతంగా కాళేశ్వరం చేరుకున్న జిష్ణుదేవ్ వర్మకు మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు స్వాగతం పలికారు. త్రివేణి సంగంమం వద్ద గవర్నర్ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం ముక్తేశ్వర స్వామివారిని దర్శిఒచుకున్నారు. కాగా, కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలకు భక్తుల రద్దీ కొన సాగుతున్నది. సోమ వారంతో పుష్కరాలు ముగియనున్నాయి. దీంతో త్రివేణి సంగమ ంలో పుణ్యస్నానం ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. కాళేశ్వరం నుంచి సిరోంచ బ్రిడ్జి వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపో యాయి. రద్దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు వన్ వే ఏర్పాటు చేసినా ట్రాఫిక్ జామ్ అయింది.





## 4 రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు..

**న్యూఢిల్లీ,25 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. గుజరాత్, కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 19 (గురువారం)న ఉప ఎన్నికలకు పోలింగ్ జరుగుతుందని.. జూన్ 23 (సోమవారం)న ఓట్ల లెక్కింపు నిర్వహిం చనున్నట్లు తెలిపింది. గుజరాత్‌లో రెండు.. కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని ఈసిఐ తెలిపింది.

## రోహిణి కార్తెలో భారీ వర్షాలు!

- ముందుగానే ఆరంభమైన వర్షాకాలం..!
- వ్యవసాయానికి సన్నద్ధమవుతున్న రైతులు




**హైదరాబాద్,25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే ఈ ఏడాది రోహిణి కార్తెలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. రోహిణి కార్తె లో రోళ్లు పగులుతాయని నానుడి ఉంది. త్రీవమైన ఎండలకు మారు పేరుగా రోహిణి కార్తెను భావిస్తారు. ప్రతి సంవత్సరం 15 రోజులు పాటు రోహిణి కార్తెలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడు. ఈ ఏడాది రోహిణి కార్తె మే 25వ తేదీతో ప్రారంభమై జూన్ 8వ తేదీతో ముగియనుంది. ఎనిమిది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను

వివరాలు 2లో

## జపాన్‌ను దాటేశాం.. 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: నీతి ఆయోగ్

**న్యూఢిల్లీ,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం చెప్పారు.దేశ నామమాత్రపు జీడీపీ 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. 2024 వరకు భారత్ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. 'వీక్షిత్ రాజ్య ఫర్ వీక్షిత్ భారత్ 2047' అనే అంశంపై శనివారం ఢిల్లీలో 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం జరిగింది. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) డేటా ప్రకారం.. భారత ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకున్నట్లు చెప్పారు."నేను చెప్పినట్లుగా మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. మనది 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. ఇది నా డేటా



కాదు.. IMF డేటా. నేడు భారత్, జపాన్ కంటే పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందింది. యునైటెడ్ స్టేట్స్, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయి. మనం వేసుకున్న ప్రణాళికకు కట్టుబడి ఉంటే.. మరో 2, 2.5 నుండి 3 సంవత్సరాల లోనే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం" అని సుబ్రహ్మణ్యం అన్నారు.

# తెలంగాణకు బిజెపి ద్రోహం చేస్తోంది

- తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా..అనుమతులు లేని ఎపి ప్రాజెక్టులకు కేంద్రం నిధుల వర్షం కురిపిస్తోంది
- కేంద్రం తన చేతిలో ఉందని ఎపి సిఎం చంద్రబాబు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి గోదావరి బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ వ్యతిరేకిస్తుందని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్ళనన్న సిఎం, అందరి కంటే ముందే వెళ్లి కూర్చున్నారు
- రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే.. సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఎందుకు మాట్లాడటం లేదు: మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు




**హైదరాబాద్,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా.. అనుమతులు లేని ఎపి ప్రాజెక్టులకు కేంద్రం నిధుల వర్షం కురిపిస్తోందని విమర్శించారు. ఎపికి ఒక నీతి.. తెలంగాణకు మరొక నీతి అన్నట్లు కేంద్ర ప్రభుత్వం వ్యహరిస్తోందని ఆరోపించారు. బిజెపికి తెలంగాణ పట్ల సవతి తల్లి ప్రేమ ఎందుకు..? అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా

వివరాలు 2లో

## ఉగ్రవాదులను లోపలికి చొరబడి కొడుతాం: ఎంపి శశి థరూర్

- సిందూర్‌పై అమెరికాలో థరూర్ బృందం



## మిస్ ఇంగ్లండ్ మిల్లాకు వేధింపులు... దర్యాప్తు చేయాలి: కెటిఆర్

- మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్రదర్యాప్తు జరపాలి
- యావత్ తెలంగాణ సమాజం తరుపున మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి క్షమాపణలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్





## భక్తులతో యాదాద్రి కిటకిట

**యాదగిరి గుట్ట,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వేసవి సెలవుల నేపథ్యంలో భక్తులతో యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం కిటకిటలాడుతోంది. ఆదివారం వేకువ జాము నుంచే ఆలయ ఈవో వెంకట్రావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలవారు జాము నాలుగు గంటల నుండే దేవాలయంలో మాడ వీధులు, ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.పరిశుభ్రత పనులన్నియు ఉదయము 4.30 గంటల లోపు తప్పని సరిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీ స్వామి వారి అభిషేకంలో పాల్గొన్న భక్తులతో మాట్లాడి దేవస్థాన వసతి , పలు సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

## ముగింపు దశకు చేరిన సరస్వతి పుష్కరాలు

### - తరలి వస్తున్న జనం



**భూపాలపల్లి,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలు ముగింపు దశకు చేరుకుంది. సోమవారంతో పుష్కర స్నానాలు ముగియనున్నాయి. ఈ రెండు రోజులు సెలవు దినాలు కావడంతో ఆదివారం నలుమూల నుంచి భక్తులు రాక తెల్లవారు జాము నుంచే ప్రారంభమైంది. కనీవిని ఎరగని స్థాయిలో భక్త జనులు కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికంగా వాహనాలు వేసుకుని రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 15 కిలో మీటర్ల పొడవున వాహనాలు బారులు తీరాయి.ఎప్పటికప్పుడు పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తున్నప్పటికీ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.అధికారికంగా ఇదే తొలిసారి కావడంతో శతాబ్దాలుగా సరస్వతి నదికి పుష్కరాలు జరుపుకునే ఆనవాయితీ కొనసాగుతున్నా ప్రభుత్వం అధికారికంగా ఏర్పాట్లు చేయడం ఇదే తొలిసారి.ఉత్తరాది ఉన్న ప్రయాగరాజ్ వద్ద మాత్రమే పుష్కరాలు నిర్వహించుకునే సాంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కాళేశ్వరంలో ప్రారంభించింది. దీంతో దేశంలో రెండో చోట సరస్వతి నది పుష్కరాలు నిర్వహించుకునే సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్టయింది. కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో పవిత్ర పుష్కర స్నానాలు కోసం దేశం నలుమూలల భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు.పుష్కరాల గురించి విస్తృతంగా ప్రచారం జరగడంతో రోజు రోజుకు భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోంది. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం అంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది. ప్రతి రోజు వేకువ జాము నుండి మొదలు రాత్రి వరకూ కూడా నదీ తీరం జనమయం అవుతోంది. నది తీరంలో సందడిసరస్వతి నదిలో ఓ వైపున కుటుంబ సభ్యులతో కలిసి పుష్కర స్నానాలు చేస్తున్నారు.అలాగే స్నానం త్రివేణి సంగమానికి చీరె సారె సమర్పిస్తున్నారు. సైకత లింగాలు ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు. పిండ ప్రదానం, పెద్దలకు తర్పణాలు ఇవ్వడంతో వివిధ సంప్రదాయం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పురోహితులు, వేదపండితులు ఈ తంతును నిర్వహిస్తున్నారు. దీంతో ఒక వైపు తర్పణాలు ఇవ్వడానికి భక్తులు, పిండ ప్రదానం చేయడానికి పురుషులు, ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి పురోహితులు, అర్చకులు ఇలా నదీ తీరంలో సందడి నెలకొంటోంది.

# అజేయ సైనిక శక్తి, అపార మోడీ యుక్తి

(మొదటి పేజీ తరువాయి)

సుస్పష్టం చేసిందని ఈ తీర్మానంలో తెలిపారు. క్లిష్ట పరిస్థితుల సమయంలో ప్రధాని మోడీ సమర్థవంతంగా వ్యవహరించారని నేతలు కితాబు ఇచ్చారు. ప్రధాని మోడీ ఎప్పుడూ సైనిక బలగాలను వెన్నుతడుతూ వచ్చారు. ఉగ్రవాదంపై పోరులో సైన్యం నిర్ణాయాత్మక చర్యలకు కేంద్రం మద్దతు ఇచ్చింది తరువాతి క్రమంలో చేపట్టిన ఆపరేషన్ సిందూరతో ఉగ్రవాదులకు వారి ప్రేరకులకు , తెరవెనుక మద్దతుదార్లకు ధీటైన చెంపచెళ్లు జవాబు ఇచ్చారని తెలిపారు.ఈ ఒక్కరోజు సమావేశానికి దాదాపుగా 19 మంది ముఖ్యమంత్రులు , ఉప ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా తమ బిజెపి అధ్యక్ష బాధ్యతలతో తరలివచ్చారు. ముందుగా ఆపరేషన్ సిందూర ప్రస్తావన తరువాతి దశలో పలు జాతీయ రాజకీయ విషయాలు చర్చకు వచ్చాయని బిజెపి వర్గాలు ఆ తరువాత మీడియాకు తెలిపాయి. కులగణన, సుపరిపాలన, మూడో దఫా అధికారంలో మోడీ ప్రభుత్వం ఏడాది పాలన వంటి విషయాలు కూడా అజెండాలో చేరాయి. రాష్ట్రాలలో సుపరిపాలనా విధానాల రూప కల్పన , కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడం గురించి కూడా చర్చ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు.

# రోహిణి కార్తెలో భారీ వర్షాలు!

(మొదటి పేజీ తరువాయి)

తాకడంతో మరో రెండు, మూడు రోజుల్లో రాష్ట్రానికి విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలో రోహిణి కార్తె ఎండలు లేనట్లేనని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఏడాది వేసవికాలం తన సంప్రదాయాన్ని వదిలేసినట్టు కనిపిస్తుంది. వేసవి కాలంలో అడపాదడపా వర్షాలు కురవడం, రోహిణి కార్తెలో ఎండ వేడికి బదులు చల్లటి వాతావరణమే ఇందుకు నిదర్శనంగా ఉంది. కేరళను(ఈ నెల 24వ తేదీ) ఇప్పటికే నైరుతి రుతుపవనాలు తాకాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. వీటి ప్రభావంతో వేడి తగ్గిపోయి వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్నారు.ఇటువంటి అకాల వర్షాల కారణంగా భూసారంలో తేడా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గమనిస్తే సాధారణం కంటే ముందుగా వర్షాకాలం ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో ముందుగా వర్షాలు పడి సరైన సమయంలో వర్షాలు పడకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఖరీఫ్ పంటను సాగు చేసేవారు వాతావరణంలో మార్పులు ఎలా ఉన్నా వారి జాగ్రత్తల్లో వారు ఉండటం మంచిదని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. మరి రోహిణి కార్తెలో వర్షాలు రైతులకు ఎంత వరకు మేలు చేస్తుందో వేచి చూడాలి.

# తెలంగాణకు బిజెపి ద్రోహం చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు..కానీ కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వరు అని అడిగారు. పోలవరంకు 80 వేల కోట్ల, బనకచర్లకు 80 వేల కోట్లు.. అంటే లక్షా 60వేల కోట్లు ఎపి ఇచ్చారని, కానీ ఒక్క శాతం అయినా తెలంగాణ ప్రాజెక్టులకు ఇచ్చారా..? అని ప్రశ్నించారు.ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజెపి ఎంపీలు ఉండి ఏం లాభం అని అడిగారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంటే ప్రభుత్వం కళ్లు అప్పగించి చూస్తోందని విమర్శించారు. నీరు జీవనాధారం అని, దేశాల మధ్య నీళ్ల కోసం పోరాటాలు జరిగిన చరిత్ర మనకు తెలుసు అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం కూడా నీళ్ల నుంచే పుట్టిందని, అంతటి ప్రాధాన్యం ఉన్న నీళ్లను కాంగ్రెస్ విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి అవసరాలు కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమైక్య ఆంధ్రలో సీమాంధ్ర నాయకుల వల్ల తెలంగాణకు తీవ్రనష్టం జరిగిందని, స్వరాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల వల్ల తీవ్రనష్టం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల రూపంలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని విమర్శించారు.**కాంగ్రెస్ పాలనలో మళ్లీ జలదోపిడి మొదలైంది...** ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన జలదోపిడి కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైందని హరీష్‌రావు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకున్నారని చెప్పారు. గోదావరి– బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్ర నష్టమని, 200 టిఎంసిల గోదావరి జలాలు తరలించుకుపోయే కుట్ర జరుగుతోందని చెప్పారు. సముద్రంలో కలిసే నీళ్లు తీసుకుపోతే తప్పేందని మాట్లాడుతున్నారని, నదీ పరివాహక ప్రాంతాల్లోని అన్ని రాష్ట్రాలు ఒప్పుకోవాలని చెప్పారు. అపెక్స్ కౌన్సిల్‌లో అనుమతి తీసుకోవాలని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై ప్రాజెక్టులు కడితే ఎందుకు మోకాలు అడ్డుపెట్టారని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు రద్దు చేయాలని, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వవద్దని ఎపి సిఎం చంద్రబాబు కేంద్రానికి ఎందుకు లేఖలు రాశారని ప్రశ్నించారు. పాలమూరు, భక్తరామదాసు, డిండి ప్రాజెక్టులపై చంద్రబాబు కేంద్రం, గ్రీన్‌ట్రైబ్యునల్, సీడబ్ల్యూసీకి లేఖలు రాశారని, హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులు వేసి మోకాలు అడ్డంపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తెచ్చుకుంటే.. చంద్రబాబు 2018లో కేంద్ర జలవనరులకు లేఖ రాశారని, దిండి, పాలమూరు రంగారెడ్డికి అనుమతులు ఇవ్వొద్దని చంద్రబాబు లేఖలు రాశారని అన్నారు. పాలమూరు, కాళేశ్వరం పాత ప్రాజెక్టులేనని, ఉమ్మడి ఎపిలో ప్రారంభించినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం కొత్త ప్రాజెక్టు కాదని, ప్రాణహితకు కొనసాగింపేనని కేంద్రం అనుమతులు ఇచ్చిందని అన్నారు. **గోదావరి బంకచర్లను ఆపాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి...** గోదావరి– బనకచర్ల కొత్త ప్రాజెక్టు నిబంధనలు ఉల్లంఘించి ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తోందని హరీష్‌రావు పేర్కొన్నరు. ఇంత జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రం జుట్టు తన చేతిలో ఉందని ఎపి సిఎం చంద్రబాబు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. గోదావరి –బనకచర్లకు ఒక్క అనుమతి లేకుండానే ఎపి ముందుకెళ్తోందని, రాత్రికిరాత్రి ప్రాజెక్టుకు రూపకల్పన చేసి టెండర్లు పిలిచి ముందుకెళ్తున్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండుసున్నాపెట్టారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడం లేదని సిఎం అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి.. ఎపి నిర్మిస్తున్న గోదావరి బంకచర్లను ఆపాలని, లేకుంటే.. ఢిల్లీలో సిడబ్ల్యూసి కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి.. తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ వ్యతిరేకిస్తుందని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసులు వేయాలని అన్నారు. **తెలంగాణకు నష్టం జరుగుతుంటే.. సిఎం ఎందుకు మాట్లాడటం లేదు...** తెలంగాణకు నష్టం జరుగుతుంటే.. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించలేదని విమర్శించారు. మౌనంగా ఉండి..సిఎం రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని ఆరోపించారు. కెఆర్ఎంబి, జిఆర్ఎంబి, అనుమతులు లేకుండా.. ఎపి ప్రాజెక్టులు కడుతోందని అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్ళనన్న ముఖ్యమంత్రి, అందరి కంటే ముందే వెళ్లి ఆ సమావేశంలో కూర్చున్నారని విమర్శించారు.సిఎం బనకచర్ల అడ్డుకుంటారు, నీతి అయోగ్ సమావేశంలో మాట్లాడుతారని అనుకున్నామని, కానీ మంత్రి మాట్లాడరు, ముఖ్యమంత్రి మాట్లాడరు అని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవా..? అని నిలదీశారు. కేంద్రం అనుమతిస్తుంటే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మౌనంగా ఎందుకు ఉంటున్నారని అడిగారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అన్ని పార్టీ నేతలను కిషన్ రెడ్డి ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్ళాలని హరీష్‌రావు అన్నారు.

# ఉగ్రవాదులను లోపలికి చొరబడి కొడుతాం: ఎంపి శశి థరూర్

- సిందూర్‌పై అమెరికాలో థరూర్ బృందం

**న్యూయార్క్ మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాకిస్థాన్ కేంద్రీకృత ఉగ్రవాదంపై ఉపేక్ష ఉండదు. దెబ్బకు గట్టి దెబ్బ బారతదేశ విధానం అని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి ఇతర చర్యలు, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలకు వివరించేందుకు ఎంపీల బృందాలు పర్యటిస్తు న్నాయి. ఇందులో భాగంగా థరూర్ నాయకత్వపు బృందం ఆదివారం అమెరికాలో మీడియాతో మాట్లాడింది. పహల్గాం ఉగ్రదాడి తరువాతి క్రమంలో రివాజు మారింది దెబ్బకు దెబ్బ , మరింత గట్టి దెబ్బ తప్పదని భారత్ రుజువు చేసిందని ఈ కీలక ఎంపిల బృందం నేత థరూర్ తెలిపారు.పాక్‌లో కూర్చోవడం, ఇండియాలో ఉగ్రదాడులకు పాల్పడటం, అమాయకులను చంపివేయడం, తమకేమీ కాదని తప్పించుకుందామంటే ఇక కుదరదు. ఉగ్రదాడులకు పాల్పడ్డ వారు ఎక్కడున్నా , వారిని పసిగట్టి , వారిని ఎంచుకుని దెబ్బ తీయడం ఇప్పటి మన పంథా అయిందని థరూర్ తెలిపారు. ఉగ్రవాదం ఎంచుకుని పౌరుల ప్రాణాలతో సయ్యాటకు దిగాలని అనుకుంటే అటువంటి వారు ఇక మూల్యం చెల్లించుకోవాల్సిందే అని థరూర్ తెలిపారు. థరూర్ సారధ్యపు ఎంపిల బృందం అమెరికా సహా బ్రెజిల్, కొలంబియా, బ్రెజిల్, గియనా, పనామా, కొలంబియాలలో పర్యటిస్తుంది. పాకిస్థాన్ ఉగ్ర వైఖరిని ఎండగట్టేందుకు భారతదేశ విశ్వ యత్నాల్లో భాగంగా ఎంపిల బృందాలు ఖరారు అయ్యాయి. న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ంఎపిల బృందం కొందరు నిర్ణీత ఎన్ఆర్ఐ ప్రముఖులతో ఇష్టాగోష్టిగా మాట్లాడింది.చర్యకు ప్రతిచర్య కటువుగా ఉంటుందనేది ఇప్పుడు శత్రువుకు తెలిసివచ్చేలా చేశామని థరూర్ తెలిపారు. పాక్‌లో తిష్టవేసుకోవడం , దాడులు సాగించడం , తాము భద్రం అనుకునే వీరికి ఇవి కాలం చెల్లేరోజులే అవుతాయని హెచ్చరించారు. భారత్ ఏ చర్యను ముందుగా ఆరంభించదు. అయితే ఎదుటి పక్షం ఏదైనా చేపడితే ఇందుకు ప్రతిగా సమాధానం గట్టిగానే ఉంటుందని ఆపరేషన్ సిందూర్‌తో తేటతెల్లం అయిందని కాంగ్రెస్ పెద్దల అధికారిక సమ్మతి లేకుండానే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపిల బృందానికి నాయకత్వం వహిస్తున్న థరూర్ తెలిపారు.పాకిస్థాన్‌లోని



ఉగ్రవాదులకు ఇప్పుడు తొలిసారి సరైన సందేశం వెలువరించడం జరిగిందని తెలిపారు. ఉగ్రవాదులు ఆరంభించారు, దీనికి భారత్ ధీటుగా స్పందించింది. 88 గంటల నిడివి యుద్ధంలో ఏం జరిగిందనేది అందరికీ తెలుసునని చెప్పారు. థరూర్ బృందంలో జెఎంఎం ఎంపి సర్ఫరాజ్ అహ్మద్, టిడిపి నుంచి గంటి హరీష్ గంటి మాధుర్ బాలయోగి, బిజెపికి చెందిన సుశాంక్ మని త్రిపాఠీ, బిజెపికే చెందిన భువనేశ్వర కల్తియా ఇతరులు ఉనానరు. ఈ ఎంపీల బృందం శనివారం ఇక్కడికి వచ్చింది.

# మిస్ ఇంగ్లండ్ మిల్లాకు వేధింపులు... దర్యాప్తు చేయాలి: కెటిఆర్

- మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్రదర్యాప్తు జరపాలి
- యావత్ తెలంగాణ సమాజం తరుపున మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి క్షమాపణలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తనను వేధించారని మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించి, ఆరాధించే గొప్ప సంస్కృతి కలిగిన తెలంగాణ గడ్డపై మిల్లా మాగీ ఎదుర్కొన్న అనుభవం తనను ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడపిల్ల తండ్రిగా, ఏ మహిళకు ఇలాంటి దురదృష్టకర



పరిస్థితి రాకూడదని ఆశించారు. యావత్ తెలంగాణ సమాజం తరుపున మిల్లా మాగీకి హృదయ పూర్వకంగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. ఆమెకు జరిగిన సంఘటన తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించదని, అది తెలంగాణ ప్రజల విలువలకు వ్యతిరేకం అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడాన్ని సంప్రదాయంగా భావించే తెలంగాణకు, రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మలే నిత్య స్ఫూర్తి ప్రదాతలు అని వ్యాఖ్యానించారు. మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ వేదికలపై జరిగే వేధింపులను ఎదిరించి నిలబడాలంటే అసాధారణ ధైర్యం ఉండాలని, మిల్లా మాగీ చూపిన తెగువ అభినందనీయమని అన్నారు. ఈ భయంకర అనుభవం నుండి ఆమె త్వరలోనే కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మిల్లా మాగి చేసిన ఆరోపణలపై విచారణ జరపకుండా ఆమెనే దోషిగా నిలబెట్టాలనుకుంటున్న ప్రభుత్వ వైఖరిని కెటిఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. సమగ్ర దర్యాప్తు జరిగి మిల్లా మాగీని వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం

● మాదిగల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది ఇందిరా గాంధీ, కాంగ్రెస్ పార్టీ ● మాదిగలకు సమూచిత స్థానం కల్పించింది కాంగ్రెస్ పార్టీ ● కష్టపడి పని చేయాలి.... పది మందికి సహాయ పడాలి







**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంటరానితనానికి, అణచివేతకు గురైన దళిత బిడ్డలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సమూచిత స్థానం కల్పించింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన లింగాల ఘనపూర్ మండల మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయంగా, సామాజికంగా దళితులకు న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అయితే, దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది ఇందిరా గాంధీని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి దళితులు కాంగ్రెస్ పార్టీ వెంటే నడిచారని అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని తిరిగే ధైర్యం ఒక్క దళితులకే ఉందని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే సమాజంలో నిలబడగలుగు తున్నామని వెల్లడించారు. అంబేద్కర్ గారు లేకున్నా, రాజ్యాంగం లేకున్నా ఏమైపోయేవాళ్ళమో తలచుకుంటేనే భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలలో అందరికీ అవకాశాలు ఒకేసారి రావని, వచ్చిన అవకాశలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడితేనే గుర్తు పెట్టుకుంటారని, అవకాశాలను దుర్వినియోగం చేసుకుంటే కనుమరుగైపోతారని హెచ్చరించారు. మన వాళ్లకు అవకాశం వస్తే మనమే సపోర్ట్ చేయడం లేదని, మన వాళ్ళు ఎదుగుతున్నారు అంటే మనమే కాళ్ళు పట్టి లాగుతున్నామని అన్నారు. అలా కాకుండా అందరిని కలుపుకొని పోతూ ఒకరికొకరు సపోర్ట్ చేసుకోవాలని తెలిపారు. రాజకీయంగా దళితులకు అవకాశం వచ్చినా పని చేసే అవకాశం మాత్రం ఇవ్వరని అన్నారు. వరంగల్ జిల్లా రాజకీయాలలో పెత్తందార్లది, భూస్వాములదే పెత్తనం ఉండేదని అయినా వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని చిన్న తప్పు కూడా చేయకుండా, ఎవరి దగ్గర తల వంచకుండా 30ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నని పేర్కొన్నారు. చాలా మందిపై అవినీతి, ఆక్రమాల ఆరోపణలు వస్తుంటాయని కానీ ఈ నాటికీ కడియం శ్రీహరి పై అవినీతి ఆరోపణలు చేసే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని వెల్లడించారు. కానీ ఇటీవల కొంత మంది నాపై కొన్ని ఆరోపణలు చేశారు. దేవునూరు గుట్టలలో 2వేల ఎకరాలు కబ్జా చేశానని, బిఆర్ఎస్ పార్టీలో బీ ఫామ్ తీసుకొని డబ్బులు తీసుకున్నానని, నియోజకవర్గ అభివృద్ధికి రూ. 800కోట్లు కాదు 8పైసలు కూడా తేలేదని ఆరోపణలు చేశారు. వాళ్ళు చేసిన ఆరోపణలు నిరూపిస్తే నాపదవికి రాజీనామా చేసి వల్ల ఇళ్లలో గులాంగిరి చేస్తానని సవాల్ విసిరితే... ఇప్పటివరకు ఉలుకు పలుకు లేదని ఏద్దేవా చేశారు. ఇలాంటి సవాల్ విసిరే దమ్ము ఎవరికైనా ఉంటుందా అని అన్నారు. మన జాతీ ఎదగడం ఇష్టం లేని వారు కుల అహంకారంతో మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎవరికీ ఎం కావాలన్నా ఇచ్చుకో... పుచ్చుకో అనే రీతిలో వ్యవహరించాడని దుయ్యాబట్టారు. పదవులు అమ్ముకున్నాడు, పనులు అమ్ముకున్నాడు, పథకాలు కూడా అమ్ముకున్నాడని ఆరోపించారు. ఆఖరికి దళిత బంధు పథకానికి మన దళితులవద్దనే పైసలు తీసుకొని మోసం చేసాడని ఆరోపించారు. చివరికి తాను ఏ పార్టీలోకి వెళ్లాలని చూసినా రానివ్వలేని నీచ స్థితికి దిగజారాడని అన్నారు. మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరి తిట్టడానికి ఒక కూలోడు కావాలని, కూలీ పని చేయడానికి బిఆర్ఎస్ లోకి తీసుకున్నారు తప్ప టికెట్ ఇవ్వడానికో, పదవులు ఇవ్వడానికో కాదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన సమాన అవకాశలు లభించాలని షెడ్యూల్ కులాల వర్గీకరణ చేసి చట్టభద్దత కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి 3వేల 500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయితే 1500 ఇల్లు దళితులకే కేటాయించినట్లు తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకంలో లింగాల ఘనపూర్ మండలానికి 640 యూనిట్లు మంజూరు అయ్యాయని వాటిని సైతం పార్టీ కోసం కష్ట పని చేసే వారికీ మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కష్టపడి పని చేస్తూ పది మందికి సహాయపడేవారికే అవకాశాలు వస్తాయని సూచించారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు ఏ ఒక్క దళిత బిడ్డకు అన్యాయం జరినివ్వనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షులు గుగ్గిళ్ల నర్సయ్య, మండల పార్టీ అధ్యక్షులు శివ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నర్సింగ రమేష్, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్

● నగరంలోని 31వ డివిజన్,59వ డివిజన్‌లో

సీసీ రోడ్లు,సైడ్ డ్రైన్ పనులకు శంకుస్థాపన









**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి 31 వ డివిజన్ హంటర్ రోడ్డు లో గల నంది హిల్స్ లో రూ.40 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం,59 వ డివిజన్ ఇందిరా నగర్,స్నేహ నగర్ లో రూ.62 లక్షలతో అంతర్గత రోడ్లు,సైడ్ డ్రైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.అదే డివిజన్ లో ఎక్సైజ్ కాలనీలో సుమారు 80 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఆదివారం దాదాపు రూ. 1.82 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.శిలాఫలకం ఏర్పాటు చేసిన కొబ్బరికాయ కొట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం నిర్ణీత సమయంలోనే పూర్తిచేస్తామని ప్రజలకు ప్రజా ప్రభుత్వం నిజమైన భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. గడిచిన 15 నెలలుగా నగరంలో ఎటువంటి ఖబ్జాలు లేవని,ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు,వ్యాపార వర్గాలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.నిత్యం పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం,నూతన ఆవిష్కరణలు,అభివృద్ధి కార్యక్రమాలపై ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమాలలో స్థానిక డివిజన్ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,కాలనీ వాసులు,ప్రజలు,పెద్దలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడు పండ్లు తింటే షుగర్ దూరం: నిపుణులు...



**కరీంనగర్,మే25(పీసీడబ్ల్యూ న్యూస్):** నేరేడు పండ్లు తింటే షుగర్ దూరం: ప్రతి రోజు ఉదయాన్నే ఖాళీ కడుపుతో నేరేడు పండ్లు తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. నేరేడు పండ్లను తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. వీటిలో ఉండే విటమిన్ సి వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. అయితే నేరేడు పండ్లను అధికంగా తినడం వల్ల జ్వరం, గొంతు సమస్యలు వస్తాయి. శ్వాస సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## వక్ఫ్ బిల్‌కు వ్యతిరేకంగా వరంగల్‌లో మానవ గొలుసు నిరసన

**వరంగల్, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్, మండి బజార్‌లో వక్ఫ్ బిల్ సవరణకు వ్యతిరేకంగా మానవ గొలుసు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆదేశాల మేరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ వరంగల్ జిల్లా కన్వీనర్ ఫసిఉద్దిన్ కాశ్మీ, ఎఎంఐఎం నాయకుడు సుభాన్ మాట్లాడుతూ, "వక్ఫ్ బిల్ సవరణ రాజ్యాంగ విరుద్ధమైనది. ఇది ముస్లింల హక్కులను కాలరాస్తూ, వారి భూములను స్వాధీనం చేసుకునే కుట్రగా తయారైంది," అని ఆరోపించారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ముస్లిం సమాజ హక్కుల పరిరక్షణ కోసమే ఈ నిరసన చేపట్టామని వారు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ముస్లింని ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.

## హొటల్ విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

● ఎమ్మెల్యేలకు ఘనంగా స్వాగతం పలికిన హొటల్ విహార గ్రాండ్ మేనేజ్మెంట్







**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**హనుమకొండ భవాని నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హొటల్ విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మేనేజ్మెంట్ ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డిలకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా హొటల్ విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ఏర్పాటు చేయడం, అభినందనీయమని ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. అనంతరం కార్పొరేటర్ వసంత–మహేందర్, హొటల్ విహార గ్రాండ్ మేనేజ్మెంట్ గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రుచులతో నగర ప్రజలకు నాణ్యమైన టిఫిన్, ఫ్యామిలీ రెస్టారెంట్, ఐస్ క్రీమ్ పార్లర్, హొటల్ విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రత్యేకత అని వారన్నారు. ఈ కార్యక్రమంలో హొటల్ విహార గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మేనేజ్మెంట్ గణేష్, కిరణ్, యాకూబ్, గోపి, శ్రీను,కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష

- 133మంది అభ్యర్థులకుగాను 122 మంది హాజరు
- పరీక్ష తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ 2025 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాకు సంబంధించి హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 133 అభ్యర్థులకు గాను 122 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 11 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష నిర్వహించిన సెయింట్ పీటర్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంతకుముందు రెవెన్యూ శాఖలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షను రాశారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ డాక్టర్ కె. నారాయణ, కలెక్టరేట్ ఏవో గౌరీశంకర్, చీఫ్ సూపర్డెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**గంగాధర, మే 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం లక్ష్మి దేవిపల్లి నరేంద్ర విద్యాలయం లో 2012–2013 పదవ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించినందుకు గర్వంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంకా మంచి స్థాయిలో ఉండి పేరు ప్రాఖ్యాతులు తీసుకురావాలి ఆకాంక్షంచారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉత్సాహం గా గడిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## బలగం అంజన్న కన్నుమూత

**హనుమకొండ, మే 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ రంగస్థల కళాకారుడు, బలగం సినిమా నటుడు అంజన్న (జీవీ బాబు) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యం తో ఆయన ఇవాళ వరంగల్ లోని హాస్పిటల్ లో చికిత్సపొందుతూ మృతి చెందారు. కమెడియన్ వేణు యెల్దండి దర్శకత్వం, దిల్ రాజు ప్రొడక్ష న్ నుండి వచ్చిన సినిమాలో బాబు హీరో ప్రియదర్శి తాతగా నటించి ఆకట్టుకున్నారు. గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధప డుతూ ఓ ప్రైవేట్ హస్పిటల్ లో డయాలసిస్ పొందుతున్నారు. ఈ మధ్యే బలగం డైరెక్టర్ వేణు యెల్దండి, హీరో ప్రియదర్శి జీవీ బాబు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అం దించారు. బలగం చిత్ర బృందంలోని సభ్యులు బాలు కాయితి, ఆకునూరి దేవయ్య, బలగం కొము రమ్మలు ఆస్పత్రికి వెళ్లి పరా మర్శించి వారికి ధైర్యం చెప్పి వచ్చారు. వేణు జీవీబాబు సతీ మణితో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. జీవీ బాబుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఇంతలోనే అంజన్న మరణించడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని డైరెక్టర్ వేణు యెల్దండి పేర్కొన్నారు. హీరో ప్రియదర్శి జీవీ బాబు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.అంజన్న రంగస్థల నటుడు.. బలగం సినిమా తర్వాత రజకార్ మూవీలో కూడా నటించారు. మొత్తం 20 సినిమాలకు పైగా నటించిన జీవీ బాబు.. బలగం చిత్రంతో గుర్తింపు పొందారు.






# సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల ఎత్తివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలి

## - కెవిపిఎస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కళాశాల ఎత్తివేత నిర్ణయం ఉపసంహరించుకొవాలి..రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 12 ఎస్సీ గురుకుల కళాశాలలు ఎత్తివేత.. రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం..ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో దళిత పేద విద్యార్థులకు తీవ్రని నష్టం.సంగారెడ్డిలో రాయికోడ్ గురుకుల కళాశాల ఎత్తివేత, కొండాపూర్ లో బైపిసి, హత్నూర లో ఫార్మా టెక్నాలజీ,బైపిసి, జహీరాబాద్ లో ఎమ్మెల్టి , సింగూర్ లా వోకేషన్ కోర్సుల ఎత్తివేత.ఈ కళాశాలల ఎత్తివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కెవిపిఎస్ సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మానిక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# ప్రశాంతంగా యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష



**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**హనుమకొండ జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 4141మంది అభ్యర్థులు పది పరీక్షా కేంద్రాలను కేటాయించగా ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకూ జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 2435 మంది అభ్యర్థుల హాజరై పరీక్ష రాశారు. 1706మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 2422 మంది పరీక్ష రాశారు. 1719మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యల గురించి ఆయా పరీక్షా కేంద్రాలకుసంబంధించిన అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

## సరస్వతి పుష్కరాలకు హాజరై పుష్కరస్నానం చేసిన గవర్నర్ దంపతులు

- స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు



**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులు సరస్వతిఘాట్ లో పుష్కర స్నానమాచరించారు. అనంతరం ఆలయంలో గవర్నర్ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాళేశ్వరం పుణ్యక్షేత్రంలోని త్రివేణిసంగమంలో సరస్వతి పుష్కరాలు ఆదివారం 11వ రోజుకు చేరుకున్నాయి.



# ప్రధాని మన్‌కి బాత్ వీక్షించిన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు..



**కరీంనగర్,మే25(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం విద్యానగర్ 39 వ డివిజన్ బిజెపి శ్రేణులతో కలిసి పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఆయన మాట్లాడుతూ మన్ కి బాత్ కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 3వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని, అప్పటినుండి ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమవుతుం దన్నారు. ముఖ్యంగా ఆ నెలలో జరిగిన అంశాలు వివిధ రంగాల్లో భారతీయులు సాధించిన విజయాలను ప్రధాని మోదీ ప్రజలతో పంచుకుంటారని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ వల్ల దేశ ఖ్యాతి ఎంతో పెరిగిందని, ఐక్యత , ప్రదర్శనల తో ప్రతి ఒక్కరు దేశానికి అండగా నిలిచిన అంశాన్ని ప్రధానంగా పీఎం మోదీ ప్రస్తావించారని తెలిపారు. ముఖ్యంగా ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం ప్రతినెల 23 జాతీయ భాషలు, 31 మండలి కాళ్లలో అన్ని కేంద్రాల ద్వారా ఆకాశవాణి ప్రసారం చేస్తుందన్నారు. అలాగే ఇంగ్లీష్ సహా 11 అంతర్జాతీయ భాషల్లోనూఇది ప్రసారమవుతుంద న్నారు. సామాన్యులతో అనుసంధానానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ ప్రోగ్రాం ప్రధాని మోదీని ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు. గుండారపు సంపత్, పాలజి ప్రదీప్.న్యాత ప్రవీణ్, లక్ష్మణ్, అశోక్, చైతన్య అభి,రాంచరణ్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో ఇంద్రేశం రోడ్డు మరమ్మతులు చేపట్టిన ఎమ్మెల్యే జిఎంఆర్

- త్వరలోనే పూర్తిస్థాయి రహదారి నిర్మాణం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పఠాన్ చెరువు - ఇంద్రేశం - దౌల్తాబాద్ రహదారి పూర్తిస్థాయి మరమ్మతుల కోసం త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఇంద్రేశం చౌరస్తా వద్ద పూర్తిస్థాయిలో ధ్వంసమైన రహదారిని ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. వర్షాకాలంలో వాహనాలు వెళ్లేందుకు.. ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని ఆయన తెలిపారు. వెంటనే సొంత నిధులతో ఇంద్రేశం చౌరస్తా వద్ద రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణానికి ఇంద్రేశంతో పాటు. రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చు గూడెం, పోచారం తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన విధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా. తిరిగి రహదారి వరమ్మత్తులు చేపట్టారని. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసం ప్రభుత్వం 50 లక్షల రూపాయల నిధులు కేటాయించగా. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేవని తెలిపారు. తక్షణ మరమ్మతుల కోసం సొంత నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే మరో మారు ప్రభుత్వంతో చర్చించి పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బీరంగూడ కిష్టారెడ్డిపేట రహదారి విస్తరణ చేపట్టిన విధంగా ఇంద్రేశం నుండి పెద్దకంజర్ల వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ లాలు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు నర్సింలు, అంతిరెడ్డి, బండి శంకర్, శివారెడ్డి, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల కాలనీలో రూ.1.5కోట్ల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు

- 3,14వ డివిజన్లలో సుమారు 2.5 కోట్ల రూపాయలు నిధులతో డ్రైనేజీ, రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు

**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా నేడు 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి వికలాంగుల కాలనీకి రూ. 1 కోటి 50 లక్షల రూపాయల సాధారణ నిధులతో రోడ్డు పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఆదివారం దాదాపు రూ. 2.20 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. శిలాఫలకం ఏర్పాటు చేసిన కొబ్బరికాయ కొట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం నిర్ణీత సమయంలోనే పూర్తిచేస్తామని, ప్రజలకు ప్రజా ప్రభుత్వం నిజమైన భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. అలాగే గడిచిన 15 నెలలుగా ఒక్కొక్కటిగా వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. నిత్యం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం,నూతన ఆవిష్కరణలు,అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను శీభరాణి - అనీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జన్ను అరుణాకర్, జన్ను సుధాకర్ , బుద్దె పెద్దన్న, రైతు రాజు, గాదె రాము, బిజిలి సంపత్, అఖిల్ తో పాటు వికలాంగుల కాలనీ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో ఈ సెట్ పరీక్ష ఫలితాలు విడుదల

- తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్, బీఎస్ సీ గణితం విద్యార్థులు లేటరల్, ఎంట్రీ ద్వారా బీటెక్ బి ఫార్మసీ, కోర్సుల్లో చేరేందుకు మే 12న నిర్వహించిన ఈసెట్ 2025 పరీక్ష ఫలితాలుఆదివారం మధ్యాహ్నం విడుదల చేశారు. మొత్తం 18,998 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్ష రాసిన విద్యార్థులు ఈ కింది డైరెక్ట్ లింక్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. కాగా ఈసెట్ పరీక్ష ఫలితాలు ఆదివారం మధ్యాహ్నం ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి,విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఈసెట్ ఫలితాల్లో మొత్తం 93.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇక ఎప్పటి మాదిరిగానే అన్ని విభాగాల్లో అమ్మాయి లు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసి ఈ ecet.tsche.ac.in డైరెక్ట్ లింక్ ద్వారా ర్యాంకు కార్డు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబాల కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# నిరుపేద మహిళ వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం

- పఠాన్ చెరువు ప్రజల అపన్నహస్తులు ఎమ్మెల్యే జిఎంఆర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అన్నా అంటే నేనున్నా అంటూ నిరుపేద మహిళ వివాహానికి అండగా నిలిచారు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. నియోజకవర్గ పరిధిలోని ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తూ ఎప్పటికప్పుడు తన దాతృత్వాన్ని చాటుకుంటూ మనసున్న మహారాజుగా ప్రజల గుండెల్లో నిలుస్తున్నారు ఎమ్మెల్యే జిఎంఆర్. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన వాటర్ వర్క్స్ ఉద్యోగి మాణిక్యం ఇటీవల మృతి చెందారు. ఆయన కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో. ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు పెళ్లి పత్రికను అందించారు. మాణిక్యంతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు.భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీటీసీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగట్టు పోలింగ్ బూత్ కేంద్రంలో మన్‌కీ బాత్ వీక్షించిన గంగాడి కృష్ణారెడ్డి...

**శంకరపట్నం,మే25(పీసీడబ్ల్యూ న్యూస్):**శంకరపట్నం మండలం కొత్తగట్టు 85 వ పోలింగ్ బూత్ బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూతెలంగాణలోని సంగారెడ్డి మహిళా రైతుల గురించి ప్రధాని మోదీ 'మన్ కీబాత్' లో ప్రస్తావించారని తెలిపారు. వ్యవసాయంలో మహిళలు డ్రోన్లను సమర్థంగా వినియోగించడంపై ప్రధాని మోదీ ప్రశంసించారని, స్వయం సహాయక సంఘాలను మరింత శక్తిమంతం చేసి,చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. అలాగే వచ్చే నెల యోగా దివస్ ను ఘనంగా నిర్వహించాలని. జూన్ 21న ఏపీలో యోగాంధ్ర కార్యక్రమం ఉంటుందని ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో చెప్పారని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోడీ తొలి మన్‌కీ బాత్ లో ఆపరేషన్ సింధూరను విజయవంతంగా నిర్వహించిన సైన్యానికి యావత్ దేశం అభివాదం చేస్తుందని, ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడంలో భారత సైన్యం చూపిన సాహసం అపారమని, సైన్యం సంకల్పానికి, సాహసానికి ఆపరేషన్ సిందూర్ ఓ ఉదాహరణ, ఆపరేషన్ సింధూర్ తో మేడిన్ ఇండియా ఆయుధ సంపత్తి గొప్పతనం ప్రపంచానికి తెలిసి వచ్చిందనే విషయాన్ని ప్రధాని మోదీ మన్ కి బాత్ లో ప్రస్తావించారని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమములో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి బీజేపీ మండల ఉపాధ్యక్షులు సుదగోని శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షులు నల్ల జయపాల్ రెడ్డి బోడా అనిల్, సీనియర్ నాయకులు మాడుగుల వెంకట్ రెడ్డి, నల్ల తిరుపతిరెడ్డి,మహేష్, పవన్,.గుర్రం సంతోష్ మీస బిరయ్యా,రామగిరి సంపత్, కతారమల్ల దిలీప్, బొంగొని రాజు, ఉమెంతల సందీప్ రెడ్డి,నూనె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు







# సీపీఐ (మావోయిస్ట్) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ ఏ నంబల్ల ఎన్కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి...

- ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్







**రామగుండం,మే25(పీసీడబ్ల్యూ న్యూస్):** తేదీ 25:05:2025 నాడు ఎన్ టి పి సి, సెంటర్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు బూటకపు ఎన్కౌంటర్ నిరసిస్తూ నల్లజెండాలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సి.పి.ఐ ఎం.ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ,మార్చ్ 2026 కల్లా మావోయిస్ట్ పార్టీని నిర్మూలిస్తామని ప్రకటించి మరీ భారత ప్రభుత్వం జరుపుతున్న ఆపరేషన్ కగార్ లో భాగంగా, నిరాయుధంగా ఉన్న ఆ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ఏనంబళ్ళ కేశవరావుతో పాటు 27 మందిని నారాయణ్ పూర్ ఎన్కౌంటర్లో చంపడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఇది ఇరువైపులా మరెంత మారణకాండకు దారి తీస్తుందోనన్న ఆందోళన ఆలోచనాపరులను కలవర పరుస్తున్నది. ఒకవైపు దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పలు రాజకీయ పార్టీలతో సహా మావోయిస్టులతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొని చర్చలు జరపడం ద్వారా శాంతియుత వాతావరణం నెలకొల్పాలని విజ్ఞప్తులు చేస్తుంటే, ప్రభుత్వం అనాలోచితంగా, విచక్షణ రహితంగా వ్యవహరిస్తుండడం పట్ల తీవ్ర విచారాన్ని కలిగిస్తుంది. ఆపరేషన్ కగార్ పేరిట గత రెండు సంవత్సరాల కాలంలోనే, వివిధ ఎన్కౌంటర్లలో 500 లకు పైగా మావోయిస్టుల, ఆదివాసుల మరణాలు సంభవించడం గమనిస్తే, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య ప్రక్రియల కంటే హింసాయుత, అణచివేత విధానాలకే మొగ్గు చూపుతుండడం ఫాసిస్టు ధోరణి తప్ప మరొకటి కాదు. ఇది దేశ భవిష్యత్ పట్ల పట్టింపు గల ఆలోచనాపరులను ఆందోళనకు గురిచేస్తుంది.ప్రభుత్వాలు మావోయిస్ట్ ఉద్యమం లేవనెత్తిన అంశాలను సానుకూల ధోరణితో అర్థం చేసుకోవడంలో విఫలమై, వారిపై ప్రభుత్వ సాయుధ బలగాలతో అణచివేతకు దిగింది. ఫలితంగా, గత ఆరు దశాబ్దాల కాలంలో వేల సంఖ్యలో మావోయిస్ట్ విప్లవకారులతో పాటు , ప్రభుత్వ బలగాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమానవీయ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా హిందూ మతాధిపత్య "హిందూ రాష్ట్రా"న్ని నిర్మించాలనుకునే మనువాద, బ్రాహ్మణీయ సంఘ్ పరివార్, దాని రాజకీయ సంస్థ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా నక్సలైట్ ఉద్యమాన్ని శాంతి భద్రతల కోణం నుండే చూస్తున్నాయి. మతాన్ని, రాజకీయాన్ని మల్టీనేషనల్ కార్పొరేట్ సంస్థలతో కలగలిపిన బీజేపీ, మధ్యభారతం లోని లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను విదేశీ కంపెనీలకు 31, మార్చి, 2026 తర్వాత ధారాదత్తం చేయక తప్పని ఒత్తిడిని ఎదుర్కొంటుంది. అందుకు ఆదివాసులను మధ్య భారత, దండకారణ్యం నుండి ఖాళీ చేయించక తప్పదు. అందుకు రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు సంక్రమించిన ఐదవ షెడ్యూల్ రక్షణలను, పెసా -1996, అటవీ హక్కుల చట్టం -2006, 1/70 లాంటి దేశీయ చట్టాలతో పాటు అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల పత్రం నియమాలను ఉల్లంఘించిన అపఖ్యా తి రాకుండా, దేశీయంగా , వెల్లువెత్తుతున్న ఆదివాసీ, పర్యావరణ, ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.అందుకు మావోయిస్ట్ పార్టీ ఒక సాకు మాత్రమే. ఇప్పటికే, బహుళజాతి కంపెనీలకు ఛత్తీస్గఢ్, ఒడిషా, మహారాష్ట్ర.తదితర ఆదివాసీ ప్రాంతాలలోని లక్షల కోట్ల ఖనిజ నిక్షేపాలను అప్పగించడానికి చేసుకున్న వందలాది ఒప్పందాలకు వ్యతిరేకంగా, శాంతియుత మార్గాలలో ఆదివాసీ ప్రజానీకం తమ జీవించే హక్కు కోసం, జల్, జంగల్, జమీన్ ల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నారు. సంస్థలను నిషేధించి, నాయకత్వాలను ఊపా లాంటి అక్రమ కేసులలో జైళ్లకు పంపినా డజన్ల సంఖ్యల్లో వేలాది మందితో నిరసన శిబిరాలను కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు. వాటిని అణచివేసే ఉద్దేశంతోనే మావోయిస్ట్ పార్టీని ఆ ప్రాంతంలోని అభివృద్ధికి ఆటంకంగా పేర్కొంటూ,ఆపరేషన్ కగార్ ను అత్యంత దుర్మార్గంగా, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ, ప్రజాస్వామిక, నైతిక విలువలను కాలరాస్తూ ఆదివాసీ ప్రాంతాలలో కొనసాగిస్తున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని ఎన్కౌంటర్ పై సెట్టింగ్తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ ఎం.ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, గూడూరు వైకుంఠం,మార్త రాములు, కలవల రాయమల్లు, సురేష్, సునీత, మల్లేష్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాహితీ సమీక్ష పోటీల్లో మంత్రి ప్రగడకు ప్రధమ బహుమతి



**ఖమ్మం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త మంత్రి ప్రగడ శ్రీనివాసరావుకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సాహితీ సమీక్ష పోటీల్లో ప్రధమ బహుమతి లభించింది. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఆదివారం జరిగిన పురస్కారాల ప్రధానోత్సవంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడాల హరికృష్ణ, ఐఏఎస్ అధికారిని శ్రీజన , మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, ప్రముఖ సాహితీవేత్త అయినంపూడి శ్రీలక్ష్మి చేతుల మీదుగా మంత్రి ప్రగడ శ్రీనివాసరావు ప్రథమ బహుమతి అందుకున్నారు. క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్న సాహితీవేత్త ఐనంపూడి శ్రీలక్ష్మి క్యాన్సర్ పై రాసిన మోనోలాగ్ ఆఫ్ ఏ వూండెడ్ హార్ట్ సుదీర్ఘ కవితకు సమీక్ష పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది సుప్రసిద్ధ సాహితీవేత్తలు పాల్గొనగా మంత్రి ప్రగడ శ్రీనివాసరావుకు ప్రథమ బహుమతి లభించింది. గతంలో వైజాగ్ సాహితీ సంస్థ నిర్వహించిన కథల పోటీల్లో మంత్రి ప్రగడ రాసిన మట్టే మనిషి కథకు రెండు రాష్ట్రాల స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన కథల పోటీల్లో మంత్రి ప్రగడ రాసిన సమిధ కథకు బహుమతి లభించింది. మంత్రి ప్రగడ శ్రీనివాసరావు కథా రచయితగా, కవితల రచయితగా , సన్మాన పత్రాల రచయితగా , సాహితీ వేదికల నిర్వాకునిగా , సాహితీ రచనల సమీక్షకునిగా, ఉపాధ్యాయుడిగా, వ్యాఖ్యాతగా రాణిస్తున్నారు. సినీ కథల రచయితగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న మంత్రి ప్రగడ శ్రీనివాసరావును జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ ఆత్మీయ సమ్మేళనం సన్మానం



**ఖమ్మం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఓల్డ్ పోలీస్ లైన్ ఖమ్మం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం సన్మాన కార్యక్రమం శ్రీనివాసనగర్ బృందావన్ గార్డెన్ ఫంక్షన్ హాలు నందు నిర్వహించడం జరిగింది. ముందుగా పెద్దలు మన నుంచి భౌతికంగా దూరం ఇన వారి ఆత్మ శాంతికి మౌనం పాటించి తరువాత రిటైర్ ఐన వారికి సన్మానం జరపడం అయింది. అదే విధంగా ప్రమోషన్ వచ్చిన వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జరుపుటకు కృషి చేసిన ఫ్రెండ్స్ అందరికీ ధన్యవాదములు. ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ 200 కోటర్స్ లో ఉన్న వాళ్ళ తల్లిదండ్రుల పిల్లలతో గ్రూప్ క్రియేట్ చేయడం ఈరోజు ఆత్మీయ మిత్రుల సమ్మేళనం మరియు సన్మానం సీఐలు మరియు ఎస్సైలకు సన్మానం నిర్వహి0చట0 జరిగింది. అందులో పాత పోలీసుల మిత్రుల అందరూ కలిసి ఆనందంగా వారి వారి తీపి జ్ఞాపకాలను పంచుకోవడం జరిగింది. ఈ గ్రూపు అందరిని కలపటానికి ముఖ్యులు బోలె పాషా కాజా అలీ, నల్ల శ్రీనివాస్, సుజావుద్దీన్ గౌరవ అధ్యక్షులు రవికుమార్ రిటైర్డ్ అడిషనల్ డిసిపి మరియు ఉమా శంకర్ వీరి సారధ్యంలో ఈరోజు గెట్ సుమారు 300 మందితో టుగెదర్ ప్రోగ్రాం జరిగింది. ఈ గెట్ టుగెదర్ విచ్చేసిన గ్రూప్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసినారు.

# ఉద్యమ నేత అలిగె జీవన్‌పై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగ పరిగణిస్తున్నాం

- నా పై దాడులు చేస్తే పోరాటం ఆగదు: అలిగే జీవన్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ మండలంబహుజన చైతన్య వేదిక సంస్థ వ్యవస్థాపకులు, ప్రజా సమస్యలపై చురుకుగా పోరాడుతున్న అలిగే జీవన్ కారుపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. జూకల్ లో జరిగిన వివాహ వేడుక కార్యక్రమం అనంతరం, ఆయన అర్ధరాత్రి నిలిపివున్న కారును (AP11 AJ 8652) దుర్మార్గంగా ధ్వంసం చేయడం జరిగింది. ఈ దాడిలో కారు వెనుక అద్దం పూర్తిగా విరిగిపోయింది. ఈ చర్య చట్ట వ్యతిరేకం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య విలువలపై చేసిన దాడిగా మేము భావిస్తున్నాం.ఈ దాడి వెనుక ఉన్న దురుద్దేశంఅలిగే జీవన్ బహుజన హక్కుల కోసం పోరాడుతున్న ప్రజా నాయకులు. ఆయన చేస్తున్న ఉద్యమం పట్ల భయభ్రాంతులకు లోనైన శక్తులు, చీకటి కోణాల నుండి వచ్చిన ఈ దాడి, ఉద్యమాన్ని అణిచివేయాలన్న కుట్రకు నిదర్శనం. ఇది కేవలం ఒక కారుపై దాడి కాదు ు ఇది ఒక ఉద్యమంపై దాడి.తనపై జరిగిన ఈ హత్య యత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు హెచ్చరిస్తున్నారు. ఈ దాడిపై వెంటనే కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. దాడిలో పాల్గొన్న దుండగులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. అలిగే జీవన్ కి, ఉద్యమ కార్యకర్తలకు పోలీస్ భద్రత కల్పించాలి. లేని యెడల ఈ దాడులు మమ్మల్ని వెనక్కి లాగలేవు. బహుజనుల హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తాం. దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందుకు తేవాలనే దిశగా, ప్రజా సమర్ధనతో ఉద్యమాన్ని మరింత బలంగా నడుపుతాం.దోషులను శిక్షించేవరకు పోరాటంకొనసాగిస్తామనిఅలిగె జీవన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.



# ఆడ బిడ్డల పెళ్ళికి రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూత..

- పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సంక్షేమ పథకాల అమలులో ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు
- అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత నాది
- కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు పెళ్లి భారం తగ్గించి ఆర్థిక చేయూత అందించాలనే ఉదేశ్యంతో అమలు చేస్తున్న పథకం కల్యాణ లక్ష్మి పథకమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 40 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 40లక్షల 04వేల 640 రూపాయల విలువగల చెక్కులను అలాగే 18మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 13లక్షల 56వేల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఒక్క లింగాల ఘనపూర్ మండలంలోనే ఏడాదిన్నర కాలంలో 241మంది లబ్ధిదారులకు సుమారు రూ. 2కోట్ల 41లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పై రూ. 8లక్షల కోట్ల అప్పులు ఉన్నా వాటికీ మిత్తిలు కడుతున్న పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదాయనికి మించి ఖర్చులు ఉండడం వల్ల ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు. మహిళకు ఫ్రీ బస్ సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను మహిళలకు అందిటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని పేద వర్గాల ఆకలిని గుర్తించి వారికీ కడుపు నిండా అన్నం పెట్టాలనే ఆలోచనతో రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పేదలందరికి ఇల్లు ఇవ్వాలనే సంకల్పంతో ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ. 4లక్షల 50వేల ఇళ్ల నిర్మాణానికి రూ. 22వేల 500కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా నిజమైన అర్హులకు ఇల్లు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఎవరూ కూడా పథకాల అమలులో ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉదేశ్యంతో రాజీవ్ యువ వికాసం పేరుతో రూ. 50వేల నుండి 4లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల మందికి అందించనున్న ఈ పథకాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పాటుపడుతుంటే కొంత మూరు?లు అవాక్కులు చేవాక్కులు పేలుతున్నారని అన్నారు. కేవలం ఆరోపణలు చేయడమే కార్యక్రమంగా పెట్టుకొని సోషల్ మీడియాను ఉపయోగించుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిరాధరమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు ఎన్నిక..

**చిట్యాల, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం లక్ష్మీపురం తండా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ మరియు గజ్జి రవి గార్ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా నగవత్ రాములు నాయక్, ప్రధాన కార్యదర్శిగా, బానోత్ రాజు నాయక్, ఉపాధ్యక్షులుగా, బానోత్ సమ్మయ్య నాయక్, కోశాధికారిగా, భానోత్ జయపాల్ నాయక్, , ప్రచార కార్యదర్శిగా, బండి శీను, కమిటీ మెంబర్స్ భారత్ కృష్ణ నాయక్ బానోత్ సమ్మయ్య నాయక్ భానుతుభద్రి నాయక్ బానోత్ గణపతి అజ్మీర్ రతన్ నాయక్. **మహిళా కాంగ్రెస్ కమిటీ.** గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా: నగవ సునీత, **ప్రధాన కార్యదర్శిగా:** బానోత్ కవిత, **ఉపాధ్యక్షురాలుగా:** బానోత్ సుమలత, కోశాధికారిగా: బండి భద్రమ్మ, ప్రచార **కార్యదర్శిగా:** మేకల సమ్మక్క కమిటీ మెంబర్స్ అజ్మీర సరిత, నంబూరు లక్ష్మి, బానోతు రాదా, బానోత్ అరుణ బానోత్ భారతి బండి మమత ఇండ్ల సరిత. వీరిని గ్రామ కమిటీ కాంగ్రెస్ కార్యకర్తలు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో భుఖ్య ప్రకాష్ నాయక్, ముఖ్య దేవేందర్, మండల కమిటీ బీసీ సెల్ అధ్యక్షు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చేయూతనివ్వడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

- ఖమ్మం క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ
- నిరుపేద మహిళకు కుట్టు మిషన్ అందజేత



**ఖమ్మం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సమాజంలోని పేదలకు తమ వంతు కర్తవ్యంగా వారికి చేయూతనిస్తూ ఆదుకోవడమే తమ లక్ష్యమని ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్లబ్ కమిటీ సమావేశం డాక్టర్ బొల్లికొండ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నేరు వరద బాధితులను ఆదుకోవడంలో తాము ముందున్నామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన నిరుపేద మహిళ చామకూరి పావనికి దాదాపు 7వేల రూపాయల విలువ చేసే కుట్టు మిషన్ ను అందజేశారు. ఆ గ్రామానికి చెందిన నరసయ్య ఆమె ఆర్థిక స్థితిగతులను తన దృష్టికి తీసుకురాగా ఆమె కుటుంబ పరిస్థితిని పరిగణలోకి తీసుకొని ఈ కుట్టు మిషన్ కు ముందుగా ఆమెను ఎంపిక చేశామన్నారు. పావనికి సమావేశం అనంతరం కుట్టు మిషన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి గెల్లా శ్రీరామ్, పి డి జి లయన్ డాక్టర్ రాఘవరెడ్డి, ఆర్ సి లయన్ డిపిసి రావు, లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు కమర్తపు కిరణ్, విశ్వేశ్వర రావు, ఎన్ వెంకటయ్య, దుర్గా నాగేశ్వరరావు, జగదీష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరులోని ఆల్విన్ కాలనీలో నిర్వహించిన నందన్ ప్రైడ్ కాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకకు బీఆర్ఎస్ నాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు ఆయన ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ఇలాంటి కార్యక్రమాలు యువ ప్రతిభను వెలికితీయడానికి మంచి వేదికగా నిలుస్తాయి, అని అన్నారు. అలాగే, క్రీడల పరంగా నేను ఎప్పుడూ తోడుగా ఉంటాను, అని హామీ ఇచ్చారు.





# క్యాన్సర్ వైద్య పరిశోధనలో తెల్దారుపల్లి వాసికి డాక్టరేట్

- తండ్రి బాటలో తనయుడు కన్నెగంటి ప్రవీణ్ కుమార్

**ఖమ్మం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** గత నాలుగు సంవత్సరాలుగా కెమిస్ట్రీ విభాగంలో క్యాన్సర్ వైద్యంలో వాడే మందుల కెమికల్ కాంబినేషన్స్ పై కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ లో రసాయనశాస్త్ర విభాగంలో "డిజైన్ అండ్ సింతసిస్ ఆఫ్ న్యూ ఇమిడజోల్ డెరివేటివ్స్ యాస్ యాంటి క్యాన్సర్ ఏజెంట్స్" అనే అంశంపై చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు అందించడంతో ఈ నెల 22న హైదరాబాద్ లో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ టి.నర్సింహస్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్( ఐఐసిటి), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజి (సిసియంబి) సహకారంతో తాను చేసిన పరిశోధనల ఫలితాలను అత్యంత ప్రతిష్టాత్మకమైన జర్నల్ ఆఫ్ మాలిక్యులార్ స్ట్రక్చర్ (ఎల్స్వియర్)సైన్స్ మ్యాగ్జిన్ లో వెల్లడించగా ఉత్తమ పరిశోధనగా ప్రశంసలు పొందింది. క్యాన్సర్ వ్యాధి ట్రీట్మెంట్ లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాల ఆధారంగా తయారుచేసే మందులవలన క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించాడు. క్యాన్సర్ వైద్యంలో ప్రస్తుతం వాడుతున్న మందులలో వాడే రసాయనాల కాంబినేషన్స్ కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదుల్లో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపాడు.'యాంటి ప్రోస్టేట్ క్యాన్సర్','హ్యూమన్ లంగ్ క్యాన్సర్',బ్రెస్ట్ క్యాన్సర్ పై పరిశోధనా పత్రాలు అత్యంత ప్రామాణికంగా వెలువరించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శంకర్ లింగం, చైర్మన్ పురుషోత్తమ రెడ్డి వెల్లడించారు.ప్రవీణ్ కుమార్ ప్రాథమిక విద్యను సాంఘిక సంక్షేమ గురుకులంలో చదవడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయిలో సంక్షేమ గురుకులాల సత్తా చాటడం అభినందనీయమని తెలంగాణ గురుకుల ఆల్ రెసిడెన్సియల్ ఎంప్లాఈస్ అసోసియేషన్ మల్టీజోనల్ అధ్యక్షుడు ఐనాల సైదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, దమ్మపేటలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలు (ప్రవీణ్ కుమార్, ప్రతిభ)లను గురుకులాల్లోనే చదివించి ఆదర్శంగా నిలిచారన్నారు. కూతురు కన్నెకంటి ప్రతిభ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆప్తమాలజి లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పారా ఆప్తాల్మిక్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగం సాధించగా కొడుకు ప్రవీణ్ కుమార్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించి నేటి గురుకుల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉద్యోగం చేస్తూ ఎకనమిక్స్ లో డాక్టరేట్ సాధించి తన గ్రామంలోని తోటివారికి స్ఫూర్తినిచ్చిన కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ ను పలువురు గురుకుల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఐనాల సైదులు, దూలం యల్లయ్య, శ్రీనివాసులు, ఉషారత్నం, యల్.ఉపేందర్, మిరియాల ధర్మారావు, మధన్ లాల్, నాగరాజు, రామారావు, ఐ.భగవత్, మేళ్ళచెర్వు జానకి, సౌగంధి యసస్విని, సాయిలిఖిత, ప్రతిభ, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహంగా కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ

- 21 కేంద్రాల్లో మండల స్థాయి శిక్షణ
- జిల్లా ప్రత్యేక అధికారిగా ఎస్ఐఈటి డైరెక్టర్ విజలక్ష్మి బాయి

**ఖమ్మం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** జూన్ 12నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమ అమలులో భాగంగా అన్ని కేడర్ల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు ప్రస్తుత వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ వ్యవహారాలు చూస్తుండటంతో ఉన్నతాధికారులు సైతం విద్యాశాఖకు సంబంధించి ప్రతి చిన్న కార్యక్రమ నిర్వహణకు పూర్తిస్థాయిలో మార్గదర్శనం చేస్తున్నారు. దీంతోపాటు ఈ శిక్షణ కార్యక్రమాలకు ఈసారి ముందుగానే తగిన నిధులు మంజూరు చేశారు. జిల్లాకేంద్రంలో జిల్లా స్థాయి శిక్షణా శిబిరాలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మండల స్థాయిలో శిక్షణా శిబిరాలు ఏర్పాటుచేశారు. ఈ నెల 13 నుంచి 30 వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు జిల్లా స్థాయిలో కొనసాగుతుండగా మండలస్థాయి శిక్షణా శిబిరాలు ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించారు. ఈ శిక్షణలో మొత్తం 5,276 మంది ఉపాధ్యాయులు, హెచ్ఎం లు పాల్గొంటున్నారు. **శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు :** జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ కోర్సు డైరెక్టర్ గా స్వీయ పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయ శిక్షణ కళాశాలకు సుదీర్ఘకాలంగా ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ డీఈవోగా రావడంతో ఉపాధ్యాయుల శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉపాధ్యాయ శిక్షణలో అయన తనకున్న అనుభవాన్ని



జోడించి జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు, ఎంఈఓ లతో ప్రత్యేకంగా చర్చించి సమగ్రమైన శిక్షణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించారు. శిక్షణా శిబిరాల నిర్వహణకు గాను ఎస్ఐఈటి డైరెక్టర్ విజలక్ష్మి బాయిని జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆమె పలుమార్లు జిల్లాను సందర్శించి స్వయంగా శిక్షణ ఏర్పాట్లు, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలిస్తున్నారు. శిక్షణతో పాటు బడిబాట, యూనిఫారం, పాఠ్య పుస్తకాల సరఫరా, పాఠశాల అనుబంధ అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది వివరాలు వంటి అంశాలపై దృష్టి సారించారు. ఉపాధ్యాయులు సైతం శిక్షణ ఆవశ్యకత ను గుర్తించి పూర్తిస్థాయిలో కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఫలితంగా జిల్లాలో కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమం రాష్ట్ర అధికారులు, పరిశీలకుల ప్రశంసలు పొందింది. శిక్షణా కార్యక్రమాన్ని ఏఎంఓ కేశవపట్నం రవికుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తుండగా సిఎంఓ యలగందుల రాజశేఖర్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ చుంచు రామకృష్ణ సహకరిస్తున్నారు. **వైవిధ్యంగా శిక్షణ :** గత ఆనవాయితీకి భిన్నంగా ఈ సారి శిక్షణలో ఉపాధ్యాయులకు ఏయే అంశాలలో ప్రత్యేక శిక్షణ అవసరమో భావించి అటువంటి నిపుణులను గుర్తించి వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. సైబర్ నేరాలు



పెరుగుతున్న దృష్ట్యా పోలీస్ శాఖ సైబర్ క్రైమ్ ఏసిపి వంశి కళాధర్ ఇతర అధికారులు సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణా తదితర అంశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. అన్ని సబ్జెక్ట్ ల స్కూల్ అసిస్టెంట్లు2,774, మండల రిసోర్స్ పర్సన్లు168, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు185, స్పెషల్ ఎడ్యుకేటర్స్ 32, ఐఇఆర్ పి లు 30 మంది మొత్తంగా జిల్లాస్థాయిలో 3,189 మంది, మండల స్థాయిలో ఎస్.జి.టి.లు 2087 మంది పాల్గొంటున్నారు. **లక్ష్యాలను సాధిస్తాం :సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, ఖమ్మం**"ఏటా పడిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచటం, మరింత నాణ్యమైన విద్యను అందించటం మా లక్ష్యం. దీనిలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తాం. ఈ నెల ప్రారంభంలో ఉన్నతాధికారులు 3 రోజులపాటు డిఈఓ లకు ఇచ్చిన శిక్షణలో ఇదే అంశాలను నొక్కి చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రణాళికలు, నిధులు ఇచ్చి అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేస్తోందన్నారు." **అమలు చేస్తేనే సార్ధకత :** కేశవపట్నం రవికుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి"జిల్లాస్థాయిలో 2 విడతలతో పాటు మండల స్థాయి శిక్షణలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు.

# ఎన్నికల నాటికి విలీన గ్రామాలలో చుక్క నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు

- సంక్షేమం,అభివృద్ధి సమపాలుగా చేస్తున్నాం
- డివిజన్ పరిధి లోని ప్రజలకు ప్రభుత్వంతో చర్చించి పట్టాలు ఇప్పిచ్చే విధంగా కృషి చేస్తానన్న ఎమ్మెల్యే నాగరాజు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు

**హనుమకొండ, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వచ్చే ఎన్నికల నాటికి ప్రతి కాలనీలో చుక్క నీరు నిల్వకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎస్సార్ నగర్ సుమారు రూ. 50 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు సైడ్ డ్రైన్ %ు% రోడ్డు ల నిర్మాణం కోసం నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజుతొలుత ఎమ్మెల్యే నాగరాజుకి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ నగర్ గ్రామంలో జి డబ్ల్యు ఎం సి జనరల్ రూ.20 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు కు ఎమ్మెల్యే నాగరాజు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.





అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జిగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. వర్షాకాలంలో సమీపిస్తున్న క్రమంలో నిర్ణీత సమయంలో రోడ్లు,డ్రైన్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే నాగరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధి అనేది నిరంతరం ప్రజలందరూ ప్రభుత్వానికి అధికారులకు సహకరించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తే ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నాయి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమవుజ్జీగా చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విలీన గ్రామాల కోసం ఆలోచన చేయక చాలా కాలనీలలో డ్రైన్, సీసీ రోడ్ల అవసరం ఉన్నదని క్రమేపీ మున్సిపల్ నుంచి ఆర్, బి నుంచి నిధులను తీసుకుని వస్తూ పనులను చేపిస్తున్నమని తెలిపారు. అలాగే డివిజన్ లోని పలుసమస్యల నా దృష్టిలో ఉన్నాయి ఒక్కొక్కటి అన్ని చూసాను తీరుస్తాను అన్నారు. ప్రధాన సమస్యలు ఇళ్ళ పట్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇప్పిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. నా సిడిఎఫ్ ,మున్సిపల్ నిధులతో డివిజన్ లోని అన్నీ కాలనీలను అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే మీకు ఏ సమస్య ఉన్న నా డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య వివరిస్తే త్వరితన పని పూర్తి చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన – సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, కాంగ్రెస్ నాయకులు సౌరం చిన్నయ్య, బండ్ల సురేందర్, వరంగల్ భాషా, పురాణం రవి, పైసా మహేష్, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చర్ల స్టాలిన్, ఈర్ల రాజేందర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి రాకేష్, కస్తూరి భరత్, పిట్ట సుధీర్, తో పాటు డివిజన్ సీనియర్ నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం జోలికొస్తే నారీమణుల సత్తా చూపిస్తాం

● ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనం ● ఉగ్రవాదులకు చుక్కలు చూపించిన భారత ఆర్మీ ● శాల్యూట్ కల్నల్ సోఫియా, కమాండ్ వ్యోమికా సింగ్ ● ఆపరేషన్ సిందూర్ విజయవంతం పట్ల మహిళల హర్షం ● జవాన్లు, దేశ ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ సిందూర్ యాత్ర

● వేలాదిగా తరలివచ్చిన జిల్లా ఆడపడుచులు






**ఖమ్మం మే 25 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** భారతదేశంలో 26మంది మహిళల సిందూరాన్ని తుడిచి పైశాచిక ఆనందాన్ని పొందిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ పేరుతో ఇదే దేశ నారీమణులు, ఆర్మీ అధికారులు కల్నల్ సోఫియా, కమాండ్ వ్యోమికా సింగ్‌ల రూపంలో చుక్కలు చూపించారని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా దేశ వ్యాప్తంగా తిరంగ యాత్రలు జరుగుతున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా ఖమ్మం నగరంలో మహిళల ఆధ్వర్యంలో సిందూర్ యాత్రను బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న మహిళలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పహల్గాంలో పురుషులను తమ భార్యల ముందే అతి కిరాతంగా హతమార్చి వారి సిందూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు భారత ప్రధాని నరేంద్ర మోడీ తగిన గుణపాఠం చెప్పారని, నారీమణుల నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్‌ను ఏర్పాటు చేసి ఉగ్రమూకలకు, పాకిస్తాన్‌కు తగిన శాస్తి చేశారని అన్నారు. ఇకపై దేశం జోలికొస్తే చావు తప్పదు అనేలా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించిన కల్నల్ సోఫియా, కమాండ్ వ్యోమికా సింగ్‌లతో పాటు ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ హిందువులా, ముస్లింలా అని నిర్ధారించుకొని మరీ 26మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు ఆర్మీ అధికారులు తగిన శాస్తి చేశారని ఎద్దేవా చేశారు. ఇకపై దేశం జోలికి, మహిళల సిందూరం జోలికి రావాలంటేనే చుట్టు పక్కదేశాలు గజగజ వణికిపోయే పరిస్థితి ఆపరేషన్ సిందూర్‌తో సాధ్యమైందని ధీమా వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం అహర్నిషలూ ప్రాణాలను ఫలంగా పెట్టి ప్రజలను కాపాడుతున్న జవాన్లకు దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని, జాతీయవాదాన్ని బలంగా వినిపించడమే ఆర్మీకి మనమిచ్చే మద్దతు అన్నారు. దేశ ఆర్మీకి మహిళాలోకంతో పాటు, ప్రతి ఒక్కరూ మద్ధతు తెలపాలని ఈ సందర్భంగా కోరారు. 26వ తేదీన వైరా పట్టణంలో తిరంగ యాత్ర జరుగుతుందని, జాతీయవాదులు అధిక సంఖ్యలో హాజరై జవాన్లకు మద్ధతు తెలపాలని కోరారు. ప్రోగ్రాం కన్వీనర్ సన్నే ఉదయ్ ప్రతాప్, బండారు నరేష్, నకరికంటి వీరభద్రం, విజయ రెడ్డి, దొడ్డ అరుణ, పమ్మి అనిత, నీరుకొండ ఉశా రాణి, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, రజినీ రెడ్డి, సురేఖ, కనగంటి నాగమణి, దార్ల మల్లేశ్వరి, శిరీష తదితరులు పాల్గొన్నారు.





## కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జీఎస్సార్

**కాళేశ్వరం, మే 25(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని ఈరోజు ఆదివారం రాత్రి రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, వరంగల్ మహా నగర మేయర్ గుండు సుధారాణి లతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా అతిథులకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, పూజారులు మేళ తాళాలు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అతిథులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు. కాగా, అంతకుముందు మంత్రి, ఎమ్మెల్యే, మేయర్ ఇతర నేతలు సరస్వతీ ఘాట్ లో పుష్కర స్నానం చేశారు. కాశీ నుండి వచ్చిన పండితుల ఆధ్వర్యంలో రాత్రి సరస్వతీ ఘాట్ ఒడ్డున కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించిన హారతి కార్యక్రమంలో అతిథులు పాల్గొన్నారు.

## 11వ రోజు సరస్వతి నవరత్న మాలా హారతిలో పాల్గొన్న మంత్రి సీతక్క





**కాళేశ్వరం మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అట్టహాసంగా 11వ రోజు సరస్వతి నవరత్న మాలా హారతి ....పెద్ద ఎత్తున హాజరై వీక్షించిన భక్తజనం సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద 11వ రోజు నిర్వహించిన సరస్వతి నవరత్న మాలా హారతి మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ప్రకాశవంతమైన దీపాల వెలుగులో త్రివేణి సంగమం దేవమందిరంలా మెరిసింది. కాశీ పూజారులు వేదఘోషల మధ్య హారతిని నిర్వహించారు. ఈ మహామంగళ హారతిని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రముగ్ధులయ్యారు. సరస్వతి నవరత్న మాల హారతిలో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామాణాభి వృద్ధి శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఈ పుణ్య ఘుడియలు అందరికీ శ్రేయస్సును, శుభాన్ని కలిగించాలని, సరస్వతి అమ్మవారి కృపతో మన తెలంగాణ అభివృద్ధి బాటలో పయనించాలని అమ్మవారిని ప్రత్యేకంగా పూజించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఆసాంతం దిగ్విజయంగా నిర్వహిస్తన్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీ కృష్ణ, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్య నారాయణ రావు, సీఎంఓ కార్యదర్శి శ్రీనివాస రాజు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలు పాల్గొన్నారు.



# పరకాలలో వైభవంగా తిరంగా యాత్ర

● ఆపరేషన్ సింధూర్‌లో సైనిక సత్తా చాటాం ● బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్



**పరకాల, మే 25(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ చైతన్య మహిళా వేదిక ఆధ్వర్యంలో పరకాలలో ఆదివారం తిరంగా యాత్ర వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పోచమ్మ గుడి నుంచి ప్రారంభమై అమరధామం వరకు కొనసాగింది. ఈ యాత్రలో మువ్వన్నెల జెండాను చేబూచి యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర పార్టీలకు అతీతంగా కులాలకు మతాలకు అతీతంగా స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పూరజనులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ..ఆపరేషన్ సింధూరం లో విజయానికి స్ఫూర్తిగా ఈ తిరంగా యాత్ర జరుపుకుంటున్నామని, ఇది భారతదేశ ఐక్యతకు నిదర్శనం అన్నారు.పాకిస్తా న్ కవ్వింపు చర్యలకు భారత సైనికులు ధీటుగా సమాధానం చెప్పారని, తొమ్మిది ఉగ్ర వాద స్థావరాలపై దాడి చేసి పాకిస్తాన్ తోకను మన సైన్యం కత్తిరించిందన్నారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఇది జస్ట్ శాంపిల్ మాత్రమే అన్నారు. ఈ యుద్ధంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఆయుధాలను ఉపయోగించామన్నారు. స్వదేశీ ఆయుధాలతో బాంఢాగారం నిండిందన్నా రు. ఆకాష్ క్షిపణి దాయాదికి చుక్కలు చూపింద న్నారు. వాళ్ళ ప్రతి చర్యలను మనం ధ్వంసం చేయగలిగామని తెలిపారు. మన దగ్గర చాలా గొప్ప ఆయుధాలు, క్షిపణులు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఉగ్రవాద పోరులో వీరోచిత పోరాటం చేసిన సైనికు కు లందరికీ జేజేలు కొట్టాలన్నారు. ఒకప్పుడు ప్ర పంచానికి విశ్వ గురువుగా ఉన్న భారత్.. ఇప్పటి వరకు ఏ దేశంపై యుద్ధానికి కాలు దువ్వలేదని గుర్తు చేశారు. మన దేశాన్ని కాపాడుకోవడానికి మాత్రమే ఆపరేషన్ సిందూర్ పేరిట ఎదురు రు దాడి చేశామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహంతో వ్యవహరించారన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా భారత్ ఉన్నదని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో మరోమారు పాక్ యుద్ధానికి వస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, డాక్టర్ రాజేశ్వరప్రసాద్, డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, జయంతి లాల్,మార్త బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్









● జిష్ణుదేవ్ వర్మ దంపతులు

**కాళేశ్వరం, మే 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** సరస్వతి ఘాట్ లో పుష్కర స్నానమాచరించి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు. ఆలయ దర్శనం, ప్రత్యేక పూజలు త్రివేణి సంగమంలో ఆదివారం పుష్కర స్నానాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సరస్వతి ఘాట్ లో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుండి ఉదయం 11.02 గంటలకు హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ దంపతులకు రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. పుష్కర స్నానానంతరం గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు స్వాగతం పలికారు. ఆలయ పూజారులు పరివట్టం, పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం తెలిపారు.గవర్నర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు గవర్నర్ దంపతులకు ఆశీర్వచనం అందించి, శ్వేత వస్త్రం, లడ్డు ప్రసాదం, చక్కెర పొంగలి మరియు అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా.రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పుష్కర ఏర్పాట్లను గవర్నర్ పరిశీలించి అధికారులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గత 11 రోజుల నుండి పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు పుష్కర స్నానాలు ఆచరించాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు.





